www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:79 SUNDAY ,AUGUST 02,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 79 ఆదివారం 02 ఆగస్టు 2026 పేజీలు :8 వెల: 4/-







## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్: దరఖాస్తుల తేదీలు ఖరారు

**తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి ప్రకటన**

**ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు**

**పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ**

**నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్ఎల్పీఆర్బీ**

హంస కలం వార్త :తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. మిగతా2లో

## తెలంగాణ రైజింగ్..

# కొత్త శిఖరాలకు రాష్ట్రం




హంస కలం వార్త

తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. మిగతా2లో



## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

- తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ
- అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలకు చెక్ పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్న పొన్నం ప్రభాకర్ 2
- వారం రోజుల్లో మరోసారి భేటీ కానున్న కమిటీ
- అన్ని పార్టీల సలహాలు తీసుకుంటామన్న మంత్రి

## భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..



- ఉత్తరాంధ్ర పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ
- రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు
- గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు సాధించిందన్న ప్రధాని
- చంద్రబాబు దార్శనికతను మనస్ఫూర్తిగా అభినందించిన మోదీ

2

2

## హైదరాబాద్ ప్రయాణికులకు శుభవార్త...

**త్వరలో మెట్రో రైలు, ఆర్టీసీకి ఒకే టికెట్!**

హైదరాబాద్‌లో మెట్రో, ఆర్టీసీకి ఉమ్మడి టికెట్ వ్యవస్థ ప్రతిపాదన

ప్రయాణికుల సౌకర్యం కోసం కామన్ మొబైల్ యాప్‌పై చర్చ

మెట్రోలో రోజువారీ, వారపు, నెలవారీ పాస్‌ల జారీకి యోచన



## ఆపరేషన్ ముస్కాన్ -XII విజయవంతం..

**664 మంది చిన్నారుల సేఫ్**

హంస కలం వార్త : సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్--XII' విజయవంతంగా ముగిసింది. జులై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన పోలీసులు.. మొత్తం 664 మంది చిన్నారులను రక్షించారు. వీరిలో 644 మంది బాలురు, 20 మంది బాలికలు ఉన్నారు. ఆపరేషన్ ముస్కాన్లో భాగంగా తెలంగాణకు చెందిన 162 మంది చిన్నారులను రెస్క్యూ చేయగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన 502 మంది చిన్నారులను గుర్తించారు. ఆపరేషన్‌లో భాగంగా సైబరాబాద్ పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మిగతా2లో

## వరద ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి



- ముంపు ప్రాంతాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- మంత్రి సీతక్క

వరద ముప్పుపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గోదావరి తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు.

## వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు

వాట్సాప్ అంకుల్స్ పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు: కేటీఆర్

సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్

నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య



వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

## హైడ్రా పనులతో మారిన రూపు



- నిండుకుండలా ఉప్పల్ నల్లచెరువు భారీ వర్షాలతో పూర్తిగా
- నిండిపోయిన చెరువు

రూ. 20 కోట్లతో హైడ్రా చేపట్టిన అభివృద్ధి పనుల సత్ఫలితం

- మురుగునీరు కలవకుండా ప్రత్యేక కాలువ నిర్మాణం
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారుల ప్రణాళిక

2



## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

- వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం భారత సంస్కృతిలో భాగమన్న సీజేఐ సూర్యకాంత్ 2
- జైపూర్‌లో జరిగిన కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సులో కీలక ప్రసంగం

## అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం

- పుణేలో తిలక్ 106వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం అందజేత
- కార్యక్రమంలో పాల్గొన్న ఫడ్నవిస్, ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్
- జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతి



హంస కలం వార్త : దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో తిరుగులేని సేవలు అందించిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను 'లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు' వరించింది. మిగతా2లో

# తెలంగాణ రైజింగ్.. కొత్త శిఖరాలకు రాష్ట్రం

తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. ప్రచురితమైన వార్తా కథనం సంబంధిత స్క్రీన్ షాట్‌ను ఎక్స్‌లో షేర్ చేశారాయన. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

**పెట్టుబడులు, ఉపాధితో వేగంగా అభివృద్ధి..**

విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాలు, క్రైమ్ బిల్లు ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీ పరిధిలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకుంటూనే, ఇతరులను వ్యక్తిగతంగా దూషించడం లేదా విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా ఉండేలా బలమైన చట్టం తీసుకురావడమే తమ కమిటీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఈ క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుపై పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కమిటీ మరోసారి సమావేశం కానుంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖులు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను తుదిరూపు ఇస్తామన్నారు. ఈ చట్టం ఎవరి హక్కులనూ కాలరాయదని, కేవలం సభ గౌరవాన్ని, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకేనని భరోసా ఇచ్చారు.

## వరద ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

వరద ముప్పుపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గోదావరి తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నామని, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. శనివారం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంగపేటలో గోదావరి వరద ప్రవాహాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వరద ముంపు ప్రాంతాల బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సీతక్క మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నందని, నది పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అంతేకాకుండా పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐతే బాధితులను పరామర్శించిన మంత్రి వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, డి పి ఓ వెంకయ్య, తహసిల్దార్ తోట రవీందర్, ఎం పి డి ఓ బద్రు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా పనులతో మారిన రూపు..

హైదరాబాద్‌లోని ఉప్పల్ నల్లచెరువు నిండుకుండను తలపిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు జలకళను సంతరించుకుంది. గతంలో ఆక్రమణలు, మురుగునీటి ప్రవాహంతో కళావిహీనంగా మారిన ఈ చెరువు, హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ చర్యలతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. సుమారు రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో హైడ్రా అధికారులు చెరువు అభివృద్ధి పనులను చేపట్టారు. ఇందులో భాగంగా చెరువు శిఖం భూమిలోని ఆక్రమణలను తొలగించారు. పరిసర ప్రాంతాల్లో నుంచి వరద నీరు సులభంగా చెరువులోకి చేరేలా రెండు కొత్త ఇన్‌లెట్లను నిర్మించారు. అదే సమయంలో, మురుగునీరు చెరువులో కలవకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రత్యేక డైవర్షన్ కాలువను ఏర్పాటు చేశారు. చెరువు గరిష్ట స్థాయికి చేరినప్పుడు అదనపు నీరు సాఫీగా బయటకు వెళ్లేలా ఔట్‌లెట్లను ఆధునికీకరించారు. ఈ నీరు నేరుగా మూసీ నదిలో కలిసేలా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. దీనివల్ల ఉప్పల్ ప్రాంతంలో వరద ముప్పు గణనీయంగా తగ్గనుంది. ఈ చెరువును కేవలం నీటి వనరుగానే కాకుండా, భవిష్యత్తులో ఆహ్లాదకరమైన పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



# మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

వివాదాలను పరస్పర అంగీకారంతో, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం భారతీయ నాగరికతలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో నిర్వహిస్తున్న కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సు రెండో రోజైన శనివారం ఆయన ప్రసంగించారు. 2023లో మధ్యవర్తిత్వ చట్టం అమల్లోకి రాకముందు నుంచే మన సంస్కృతిలో ఈ విధానం ప్రాచుర్యంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో శాసన, న్యాయ వ్యవస్థలు ఈ పద్ధతిని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఒక నారింజ పండు కోసం వివాదానికి దిగిన ఇద్దరు సోదరీమణుల కథను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకరికి పండు గుజ్జు, మరొకరికి తొక్క అవసరమైనప్పటికీ, ఆ విషయం స్పష్టంగా మాట్లాడుకోకపోవడంతో వారు పండును చెరిసగం పంచుకున్నారని, ముందే తమ అవసరాల గురించి చర్చించుకుని ఉంటే ఇద్దరికీ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేదని వివరించారు. మన ప్రాచీన గ్రంథాలైన వేదాలు, రామాయణం, మహాభారతాల్లోనూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న సామ, దాన, భేద, దండోపాయం అనే నాలుగు పాలనా పద్ధతుల్లో మొదటిదైన 'సామ' నుంచే ఆధునిక మధ్యవర్తిత్వం ఉద్భవించిందని విశ్లేషించారు.

## హైదరాబాద్ ప్రయాణికులకు శుభవార్త...

హైదరాబాద్ ప్రయాణికులకు ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. మెట్రో రైలు, టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఒకే టికెట్‌తో ప్రయాణించే వెసులుబాటును అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ అధ్యక్షతన నిన్న జరిగిన హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో, ఆర్టీసీ సేవలను అనుసంధానిస్తూ 'కామన్ మొబిలిటీ టికెటింగ్' (ఒకే టికెట్ విధానం) విధానాన్ని రూపొందించాలని సీఎస్ సంజయ్ జాజూ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం టీజీఎస్‌ఆర్టీసీ అధికారులతో సంప్రదింపులు జరపాలని, ప్రయాణికులందరికీ ఉపయోగపడేలా ఒక ఉమ్మడి మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. అంతేకాకుండా, మెట్రో ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా రోజువారీ, వారపు, నెలవారీ ట్రావెల్ పాస్‌లను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించాలని కోరారు. మెట్రో నెట్‌వర్క్ విస్తరిస్తున్న నేపథ్యంలో, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు మెట్రో కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మెట్రో రెండో దశ (ఫేజ్-2)కు సంబంధించిన భూసేకరణ, ఇతర పనుల పురోగతిని కూడా సమీక్షించారు.

## ఆపరేషన్ ముస్కాన్ -XII విజయవంతం..

మొత్తం 664 మంది చిన్నారులను రక్షించారు. వీరిలో 644 మంది బాలురు, 20 మంది బాలికలు ఉన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తెలంగాణకు చెందిన 162 మంది చిన్నారులను రెస్క్యూ చేయగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన 502 మంది చిన్నారులను గుర్తించారు. ఆపరేషన్‌లో భాగంగా సైబరాబాద్ పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమలు, కంపెనీలు, దుకాణాలు, హోటళ్లు, నిర్మాణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలను, ర్యాగ్ పికింగ్‌తో, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించారు. రక్షించిన చిన్నారుల వివరాలను దర్పణ్ యాప్‌లో పోలీసులు నమోదు చేశారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చే లక్ష్యంతో పోలీసులు ఆపరేషన్ ముస్కాన్ చేపట్టారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చిన్నారుల భద్రతే లక్ష్యంగా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు.

## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్: దరఖాస్తుల తేదీలు ఖరారు

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ శాఖతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. మొత్తం ఖాళీలలో అత్యధికంగా కానిస్టేబుల్, ఆ పైస్థాయి ఉద్యోగాలే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోస్టుల వివరాలను పరిశీలిస్తే సివిల్ ఎస్సై-148, ఏఆర్ ఎస్సై-14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై-12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై-03, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై-23, సివిల్ కానిస్టేబుల్-3,697, ఏఆర్ కానిస్టేబుల్-1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్-24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో-20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో-07 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

## వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు

వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం

దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో తిరుగులేని సేవలు అందించిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను 'లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు' వరించింది. మహారాష్ట్రలోని పుణేలో ఈరోజు బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అజిత్ దోవల్‌కు అందజేశారు. ఈ వేడుకలో లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డు కింద ఒక జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేశారు. దేశ భద్రత, దౌత్యం, ఇంటెలిజెన్స్ రంగాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న అజిత్ దోవల్ (81) భారత రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. 'ఆపరేషన్ బ్లాక్ థండర్', డోక్లామ్ వివాదంలో వ్యూహాత్మక దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల రూపకల్పనలో ఆయన పాత్ర అత్యంత ప్రశంసనీయం. 1968 కేరళ కేడర్‌కు చెందిన ఈ మాజీ ఐపీఎస్ అధికారి, మూడు దశాబ్దాలకు పైగా భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేసి, ఆ తర్వాత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా సేవలు అందించారు.

# సంపాదకీయం

## బోనాలు- తెలంగాణ సంస్కృతికి ప్రతీక



పండుగలు కేవలం ఆనందాన్ని పంచే సందర్భాలు మాత్రమే కావు. అవి ఒక సమాజం చరిత్రను, సంస్కృతిని, విశ్వాసాలను, జీవన విధానాన్ని తరతరాలకు అందించే సజీవ సంప్రదాయాలు. అలాంటి సంప్రదాయాల్లో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, హైదరాబాద్ నగర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే పండుగ ఆషాఢ బోనాలు. ఇది ఒక మతపరమైన ఉత్సవం మాత్రమే కాదు. భక్తి, సంస్కృతి, స్త్రీశక్తి, సామాజిక ఐక్యత, ప్రజల విశ్వాసం, తెలంగాణ అస్తిత్వం-- ఈ ఆరు విలువల సమ్మేళనం. తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ఈ పండుగ నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సాంస్కృతిక వేడుకగా ఎదిగింది. హైదరాబాద్ ఒక విశ్వనగరం. ప్రపంచంలోని అనేక దేశాల ప్రజలు ఇక్కడ నివసిస్తు న్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ పెట్టుబడులతో పాటు తన సాంస్కృతిక మూలాలను సజీవంగా నిలబెట్టుకున్న అరుదైన నగరం హైదరాబాద్. చార్మినార్ వైభవం, గోల్కొండ చరిత్ర, భాగ్యనగర ఆత్మ-- ఇవన్నీ బోనాల సందర్భ ంగా మరింత సజీవంగా కనిపిస్తాయి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి లాల్‌దర్వాజ, అక్కన్న మాదన్న దేవాలయం, గోల్కొండ ఎల్లమ్మ, బల్కంపేట ఎల్లమ్మ, కట్టమైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల వరకూ ప్రతి వీధి భక్తి పారవశ్యంతో కళకళలాడుతుంది. ఇది కేవలం ఉత్సవం కాదు; హైదరాబాద్ తన మూలాలను మరువలేదని ప్రపంచానికి చెప్పే గొప్ప ప్రకటన.

1813 ప్రాంతంలో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి విజృంభించినప్పుడు ప్రజలు అమ్మవారిని ప్రార్థించి, వ్యాధి నివారణ అనంతరం కృతజ్ఞతగా బోనం సమర్పించారనే కథనం ప్రచారంలో ఉంది. కాలక్రమేణా అది ఒక కుటుంబ ఆచారం నుంచి సమాజ ఉత్సవంగా, తదుపరి తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుగా రూపాంతరం చెందింది. 'బోనం' అంటే భోజనం. కానీ దాని వెనుక ఉన్న భావం అంతకంటే గొప్పది. తల్లి తన బిడ్డకు ప్రేమతో అన్నం పెట్టినట్లే, భక్తుడు అమ్మవారికి కృతజ్ఞతతో నైవేద్యం సమర్పించడం.

ఈ పండుగలో మహిళల పాత్ర అత్యంత విశిష్టమైనది. తలపై బోనం మోసుకుని అమ్మవారికి సమర్పించే ప్రతి మహిళలో భక్తి మాత్రమే కాదు, కుటుంబానికి, సమాజానికి ఆధారమైన శక్తి ప్రతిఫలిస్తుంది. తెలంగాణ సంస్కృతిలో స్త్రీకి ఉన్న గౌరవాన్ని బోనాలు అత్యంత అందంగా ఆవిష్కరిస్తాయి. పోతురాజు వీరనృత్యం ధైర్యానికి ప్రతీక. రంగం భవిష్యత్తుపై ప్రజల విశ్వాసానికి ప్రతీక. ఘటాల ఊరేగింపులు సామూహిక భక్తికి ప్రతీక. డప్పుల మోత తెలంగాణ జానపద సంస్కృతికి ప్రతిధ్వని. ఈ సంప్రదాయాలన్నీ కలిసి బోనాలను ప్రపంచంలోనే ప్రత్యేకమైన ప్రజా సాంస్కృతిక ఉత్సవంగా నిలబెడుతున్నాయి. బోనాల గొప్పతనం భక్తిలో మాత్రమే కాదు, సమాజాన్ని ఒక్క తాటిపైకి తీసుకురావడంలో కూడా ఉంది. కులం, మతం, భాష, ప్రాంతం అనే భేదాలు లేకుండా లక్షలాది మంది ఈ ఉత్సవంలో పాల్గొంటారు. ఇదే హైదరాబాద్ గంగా--జమున తహజీబ్‌కు ప్రతీక. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ బలం అయితే, హైదరాబాద్‌లో బోనాలు దానికి సజీవ రూపం.నేటి తరానికి బోనాలు ఒక సాంస్కృతిక పాఠశాల. ఆధునికతను స్వీకరిస్తూనే సంప్రదాయాలను ఎలా కాపాడుకోవాలో ఈ పండుగ నేర్పుతుంది. మూలాలను మరచిపోయిన సమాజం తన భవిష్యత్తును నిర్మించుకోలేదనే విషయాన్ని గుర్తు చేస్తుంది. బోనాల పండుగకు దేశ విదేశాల నుంచి వచ్చే సందర్శకులు తెలంగాణ జానపద కళలు, ఆలయ సంప్రదాయాలు, స్థానిక ఆహార సంస్కృతి, హస్తకళలను ఆస్వాదిస్తున్నారు. వేలాది చిన్న వ్యాపారులు, కళాకారులు, పూల వ్యాపారులు, చేతివృత్తిదారులకు ఈ పండుగ జీవనోపాధిని కల్పిస్తోంది. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం బోనాల మహోత్సవాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, అగ్నిమాపక సౌకర్యాలు, ప్రజా రవాణా ఏర్పాట్లను సమన్వయంతో అమలు చేస్తున్నాం. ప్రభుత్వం, పోలీసులు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, విద్యుత్, ఆరోగ్య, రవాణా తదితర శాఖలు సమష్టిగా పనిచేస్తూ భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రిగా నాకు బోనాలు ఒక పరిపాలనా కార్యక్రమం మాత్రమే కాదు. తెలంగాణ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసే సాంస్కృతిక బాధ్యత. ప్రతి భక్తుడు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకోవడం, ప్రతి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా జరగడం, ప్రతి పౌరుడు సురక్షితంగా ఉండడం మా ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం.బోనాలు మనకు ఒక శాశ్వత సందేశాన్నిస్తాయి-- అభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, ఆధునిక మౌలిక సదుపా యాలు మాత్రమే కాదు; మన సంస్కృతిని, సంప్రదాయాలను, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించడం కూడా. హైదరాబాద్ ఎంత ఆధునిక మహానగరంగా ఎదిగినా, దాని హృదయం మాత్రం అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ సంస్కృతీ సుగంధంతో పరిమళిస్తుంది. అదే బోనాల మహిమ. అదే హైదరాబాద్ ఆత్మ. అదే తెలంగాణకు గర్వకారణం.

# 'సర్'లో సర్వమూ నిరంకుశత్వమే

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తెలంగాణలో మొదలైన 'సర్' (ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ) కార్యక్రమం ప్రజల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఓటర్ కార్డు ఉంది కాబట్టి మా ఓటుకు ఏ ఢోకా లేదని చదువుకున్న మధ్యతరగతి వాళ్ళు, ప్రతిసారీ జరిగినట్లే ఇప్పుడు కూడా ఓటర్ నమోదు జరిగిపోతుందని శ్రామికవర్గ ప్రజలు, అసలిందంతా ముస్లిం ఓటర్లను తీసెయ్యటానికి కాబట్టి మనకేం కాదని ముస్లిమేతరులు భావిస్తున్నారు. ఇప్పటికే బిహార్, బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలను గమనించిన ప్రజలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలు భయాందోళనలో ఉన్నారు.గత సంవత్సరం ఎన్నికల సంఘం-- దేశం మొత్తం మీద ఈ ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ చేపడతామని, 2002లో ఇటువంటి ప్రత్యేక సవరణ జాబితా విడుదల చేశామనీ, దాని తర్వాత ఇప్పుడు చేస్తున్నామనీ ప్రకటించింది. వెనక్కి తొంగి చూస్తే, అప్పటి జాబితా తయారీకి ప్రచార ప్రయత్నం 1999లో ప్రారంభ మైందని, 2003లో జాబితాను ప్రచురించారని తెలుస్తుంది. దీనివల్ల ఓటర్లు ఇబ్బందులు పడిన సమాచారం కానీ, అంతకు ముందు ఓటర్ల జాబితాతో లింకు చేసుకోవాలని, లేక తమ తల్లిదండ్రుల పేర్లతో లింకు చేసుకోవాలని, లేని వాళ్ళు సాక్ష్యాధారాలు ఇవ్వాలనే షరతులు కూడా మనకు అప్పటి వార్తల్లో కనిపించవు.

జరుగుతున్న ప్రత్యేక 'సమగ్ర' ఓటర్ల జాబితాలోని షరతులు, రెండు దశాబ్దాల ముందటి జాబితాతో తప్పనిసరిగా లింకు చేసుకోవాలనే నియమం, ఓటర్ల గుర్తింపు పత్రాల సమర్పణ మొదలైనవి మనకి 'ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950'లో కానీ, 'ఓటర్ల నమోదు నియమాలు 1960'లో గానీ దొరకవు. ఇవన్నీ 'అవసరానికి తగ్గట్లు ప్రమాణాలని పెట్టొచ్చు' అని చట్టంలో ఉన్న నియమాన్ని ఎన్నికల సంఘం విస్తృతంగా, నిరంకుశంగా విస్తరించి తయారుచేసిన ఫలితం.

విదేశీ చొరబాటుదారులు ఓటర్ గుర్తింపు కార్డులు తెచ్చుకుని తమ ఓట్ల ద్వారా రాజకీయాలని శాసిస్తున్నారనే ప్రచారోద్యమం భారతీయ జనతా పార్టీ విపరీతంగా చేస్తూ వస్తోంది. 2018లో అస్సాంకున్న సంక్లిష్ట వలసల చరిత్ర నేపథ్యంలో, ఎప్పటి నుంచో ఒప్పుకున్న డిమాండ్‌ని అనుసరించి రాష్ట్ర పౌరుల జాబితా తయారు చేస్తే, ముస్లింల కన్నా హిందువులు ఎక్కువగా తొలగింపబడ్డారు. దాంతో అసలు ఇక్కడ కాదు, దేశమంతా చొరబడ్డారు అంటూ జాతీయ పౌరుల జాబితా తయారు చేస్తామని 2019లో ప్రకటించారు. పౌరసత్వ చట్టాల్లో మతపరమైన ప్రమాణాలని ప్రవేశపెడితే అంతర్జాతీయ నిరసనతో పాటు దేశవ్యాప్త ప్రతిఘటన రావటంతో కొంత కాలం వెనక్కి తగ్గారు. కానీ, ఈవీఎంలతో పాటు, ఓటర్ల జాబితాను ఎంత తారుమారు చేసినా 2024 ఎన్నికల్లో ఎదురుదెబ్బ తినటంతో, 2025లో ఈ ఆయుధాన్ని కొత్త రూపంలో ప్రచారంలోకి తెచ్చారు. ఓటర్ల జాబితా నుంచి విదేశీ ఓటర్లని ఏరివేస్తామంటూ పౌరసత్వంతో దీన్ని జత చేశారు. ఒకప్పుడు అస్సాంకి మాత్రమే పరిమితమైన ఈ పౌరసత్వ పరీక్షని ఇప్పుడు అందరికీ వర్తింపజేస్తున్నారు.భారత పౌరసత్వ చట్టం బ్రిటిష్ ఇండియా విభజన నేపథ్యంలో ఏర్పడటంతో మొదటి నుంచీ కొన్ని షరతులు ఉంటూ వచ్చాయి. అస్సాం ఒప్పందం తర్వాత, 1986లో తెచ్చిన పౌరసత్వ చట్ట




సవరణలో... భారత పౌరులు కావాలంటే పుట్టుకతో పాటు, కనీసం తల్లి గానీ, తండ్రి గానీ పౌరులు అయ్యుండాలనే నిబంధన, ఆ తర్వాత 2003లో తల్లిదండ్రులు ఇద్దరూ కూడా పౌరులు అవటమే గాక, అక్రమ వలసదారులు అయ్యుండకూడదని, అటు వంటి వారిని 'విదేశీయులుగా' పరిగణించి 'నిర్బంధ శిబిరాలకు' తరలించాలనే నిబంధన తెచ్చారు. ఈ సవరణలని కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీల వాళ్ళు సమర్థించారు.

పౌరులు కాని వాళ్ళు ఓటర్ల జాబితాలో ఉండకూడదు అనే నియమం తప్ప, ఈ పౌరసత్వ చట్టాలకు, పౌరసత్వ నిర్ధారణ ప్రక్రియకు, ఓటర్ల జాబితాతో, దాని సవరణతో ఏ చట్టపరమైన సంబంధం లేదు. అయితే, ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణలో ఈ 'వంశ పారంపర్యత' నిరూపణకు కేంద్ర స్థానం ఇచ్చారు. ప్రతి ఓటర్‌ని, 2002 జాబితాతో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తమ సంబంధాన్ని నిరూపించుకోవాల్సిందిగా కొత్త నియమం తెచ్చారు. అంటే, తాము గానీ, తమ తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతలు 2002 ఓటర్ల జాబితాలో ఉన్నారని చూపెట్టాలి. దీన్నే మాపింగ్ అంటారు. మనం, మన చుట్టాలు 2002 జాబితాలో లేకపోతే మనకి ఎన్నికల సంఘం నుంచి ముసాయిదా జాబితా తయారీ తర్వాత నోటీసు వస్తుంది. అప్పుడు మన స్థానిక ఎన్నికల ఆఫీసర్ దగ్గరికెళ్లి మనం ఇక్కడే పుట్టామనీ, చదివామనీ, లేదా ప్రభుత్వం మనని గుర్తించిందని సరిపడే సాక్ష్యాలని ఎన్నికల సంఘం చెప్పిన 11 పత్రాలు, ఇతర సాక్ష్యాల ద్వారా చూపెట్టి మన అర్హతని నిరూపించుకోవాలి. అలా చెయ్యలేకపోతే, మనం పూర్తి 'అనుమానా స్పదులు'గా మారతాం.

అందరికీ ఉండే రేషన్ కార్డు, వివిధ రకాల సంక్షేమ కార్డులని, ఎవరైనా డబ్బులిచ్చి సంపాదిస్తారన్న నెపం మీద ఈ 11 పత్రాలలో వాటిని చేర్చలేదు. ఈ పత్రాల్లో అస్సాం పౌరసత్వ జాబితా, ఫారెస్టు రైట్స్ పత్రం, 10వ క్లాస్ సర్టిఫికెట్ అతి తక్కువమందికి ఉంటే.. పర్మినెంట్ రెసిడెంట్ సర్టిఫికెట్, ఫ్యామిలీ రిజిస్టర్ ఎవరికీ ఉండవు. అసలు ఈ ఫ్యామిలీ రిజిస్టర్ ఏమిటో ఇప్పటికీ చాలామంది అధికారులకే తెలియదు. రాజస్థాన్‌లో ఉన్నాయని వినికిడి. స్కూలు డ్రాప్‌ఔట్స్‌కి మిగిలిన ఆరింటిలో కుల ధ్రువీకరణ పత్రం కూడా ఉండదు. వీటన్నింటితో పాటు బెంగాల్ ఎన్నికల తర్వాత లాజికల్ డిస్క్రిపెన్సి పేరుతో కొత్త 'తొలగింపు ప్రమాణాలు' తెచ్చారు. మన పేరు, వివరాలు, ఓటర్ జాబితాలోనూ, అధికారిక పత్రాల్లోనూ ఏ తప్పులు లేకుండా సరిగ్గా సరిపోవాలి. తల్లులకు, పిల్లలకు మధ్య వయసులో తేడా 15ఏళ్ల కంటే తక్కువ ఉండకూడదు. అన్ని కార్డులు, జాబితాల్లో తండ్రి పేరు సరిగ్గా ఒకలాగే ఉండాలి. ఇవి కాకుండా ఎన్నికల ముందు కూడా కొత్తవి తేవచ్చు.

అతి తక్కువ సమయంలో, శిక్షణ లేని వ్యక్తుల ద్వారా, తీవ్ర ఒత్తిడి కింద పని చేయించటంతో ఈ ప్రక్రియ అన్ని స్థాయిల్లో అనేక తప్పుల తడకలతో నడుస్తోందని సాక్ష్యాధారాలతో సహా ఉన్నత న్యాయస్థానికి వెళ్లగా... పర్లేదు, తప్పులు దిద్దుకుంటారులే అంటూ, సర్దుకుపొమ్మని చెప్పింది. ఈ గతాన్ని తవ్వి తీసే నియమాలన్నీ ఓటు హక్కుని ఉల్లంఘించే విధంగా ఉన్నాయని అభ్యర్థిస్తే.. అర్హులు కాని వాళ్ళని తొలగించటానికి ఈ మాత్రం చెయ్యాలన్నది. లాజికల్ డిస్క్రిపెన్సి చాలా అన్యాయమని అంటే, నెమ్మదిగా ట్రిబ్యునల్స్ సమస్యలని పరిష్కరిస్తాయి, అప్పటి వరకూ మీరు ఓట్లు వెయ్యకండి, తర్వాత వేసుకోండి అని కోర్టు చెప్పింది. తానే పదేళ్లు సాగదీసి అందరినీ తీసుకునేలా చేసిన ఆధార్ కార్డుని షరతులతో 12వ గుర్తింపుపరంగా చేర్చటానికి ఆమోదించింది.

రూపంలోనే ఇంత సంకుచితంగా, నిరంకుశంగా ఉన్న ఈ సవరణ అమలులో ఎట్లా జరిగిందో చూద్దాం. ఈ ప్రక్రియలో అణగారిన, వలస వచ్చిన, సంచార జాతుల ప్రజలు, అన్ని వర్గాల అణగారిన ప్రజల్లో ముఖ్యంగా స్త్రీలు అందరూ కలిపి దాదాపు ఆరు కోట్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. బెంగాల్‌లో కొన్ని జిల్లాల ఓటర్ల తొలగింపులో 65శాతానికి పైగా ముస్లిం స్త్రీలు ఉన్నారు. గత రెండు ఎన్నికల నుంచి ఉత్సాహంతో ఓటు వేస్తున్న స్త్రీల శాతం ఈ 'సర్'లో పడిపోయింది. దానికి కారణం-- పెళ్లి తర్వాత అత్తగారింటికి వలసలు, ఇంట్లోంచి గెంటివేయటం, ఇతర వలసలు, కుటుంబ హింస, చదువు లేకపోవటం వంటి కారణాలతో ధ్రువీకరణ పత్రాలు సరైన సమయంలో ఇవ్వలేకపోవటం. బిహార్‌లో ప్రయోగాత్మకంగా 2025 జూన్‌లో మొదలైనప్పుడు ఏవయితే సమస్యలని అనేకమంది క్రింది స్థాయి కార్యకర్తలు ఎత్తి చూపించారో, వాటిని సరిదిద్దుకోవటం బదులు, బెంగాల్‌కి వచ్చేసరికి కొత్త ప్రమాణాలని రంగంలోకి తీసుకొచ్చి ఇంకా సంక్లిష్టంగా తయారు చేశారు.

ఓటర్ల మీద బాధ్యత నెట్టెయ్యటం, ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాణాలను కావాల్సినట్లు మార్చుకునే నిరంకుశాధికారాన్ని పెట్టుకోవటం, దొడ్డిదారిన పౌరసత్వ నియమాలతో దీనికి ముడివెయ్యటం, అంతేగాక, ప్రజలను పెద్ద ఎత్తున జాబితా నుంచి తొలగించే ఉద్దేశాలతోనే కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం ద్వారా ఈ 'సర్' అనే దుర్మార్గాన్ని తెచ్చింది. దీన్ని ఎదుర్కోవటం, తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థకి, రాజకీయ పార్టీలకి, పౌర సమాజానికీ, అన్ని సామాజిక సంస్థలకి చాలా పెద్ద పరీక్షే!

# కొత్త భాగ్యపథం భోగాపురం

ఒకప్పుడు పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే భూమి, నీరు, విద్యుత్ చాలు అనుకునేవారు. నేడు ప్రపంచ పెట్టుబడిదారుడు ముందుగా అడిగేది ఒక్కటే... మీ ప్రాంతానికి అంతర్జాతీయ కనెక్టివిటీ ఎంత? ఆ ప్రశ్నకు ఇకపై ఆంధ్రప్రదేశ్ గర్వంగా చూపించబోయే సమాధానం... భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం. ఇది కేవలం మరో విమానాశ్రయం కాదు. ఉత్తరాంధ్ర భవిష్యత్తును ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించే స్ట్రాటజిక్ గేట్‌వే. నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న భోగాపురం విమానాశ్రయం, ఆంధ్రప్రదేశ్ విమానయాన చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలకబో తోంది.దాదాపు రూ.4,700 కోట్ల వ్యయంతో నిర్మితమైన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, తొలి దశలోనే సంవత్సరానికి సుమారు 60 లక్షల మంది ప్రయాణికులను చేరవేసే సామర్థ్యంతో రూపొందింది. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా దీన్ని మరింత విస్తరించేలా ప్రణాళిక సిద్ధమైంది. ప్రారంభం నుంచే అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న టెర్మినల్, బోయింగ్ 777, ఎయిర్ బస్‌లు దిగే దీర్ఘమైన రన్‌వే, తుపానులను తట్టుకునే పటిష్ఠమైన నిర్మాణం, 136 ఎకరాలలో ఏరోస్పేస్ యూనివర్సిటీ, విస్తృత కార్గో సదుపాయాలు, భవిష్యత్ విస్తరణకు అవసరమైన భూ సామర్థ్యం... ఇవి భోగాపురాన్ని సాధారణ ప్రాంతీయ విమానాశ్రయం కంటే ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.



ప్రతిపాదిత ఏరోసి టీలో విమానాశ్రయం మాత్రమే కాదు, ఏరోస్పేస్--డిఫెన్స్ పార్క్, కార్గో-- లాజిస్టిక్స్ హబ్, పరిశోధన--అభివృద్ధి కేంద్రాలు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, శిక్షణా క్యాంపస్‌లు, వాణిజ్య-- నివాస ప్రాంతాలను ఒకే మాస్టర్‌ప్లాన్‌లో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సుమారు 500 ఎకరాల ఏరోస్పేస్--డిఫెన్స్ పార్క్ కూడా ప్రతిపాదిత భాగంగా ఉంది. కానీ భోగాపురం విమానాశ్రయ అసలు విలువ ప్రయాణికుల సంఖ్యలో లేదు. దాని భౌగోళిక స్థానంలో ఉంది. ఒకవైపు తూర్పు తీరంలోని ప్రధాన సముద్ర ద్వారం విశాఖపట్నం పోర్టు. మరోవైపు దేశంలో వేగంగా ఎదుగుతున్న ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు. భారత ఐటీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విశాఖ ఐటీ ఎకోసిస్టమ్. దేశ భద్రతలో అత్యంత కీలకమైన తూర్పు నౌకాదళ కమాండ్. హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్, విశాఖ రిఫైనరీ, పెట్రోలియం నిల్వలు, స్టీల్ ప్లాంట్, ప్రత్యేక ఆర్థిక మండలాలు, రాబోయే పారిశ్రామిక కారిడార్లు. ఈ మొత్తం పారిశ్రామిక శక్తికి భోగాపురం సహజ వైమానిక కేంద్రంగా మారే అవకాశం ఉంది.

# మంత్రి వివేక్ పై దుష్ప్రచారం తగదు

**- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్**

**రామకృష్ణాపూర్ ఆగస్టు 1 హంస కలం వార్త**

రామకృష్ణాపూర్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న నేషనల్ హైవే--363 సర్వీస్ రోడ్డును, కల్వర్టును తెలంగాణ రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రత్యక్షంగా పరిశీలించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి సోషల్ మీడియా, వాట్సాప్ వేదికల ద్వారా దుష్ప్రచారం చేయడం అత్యంత హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. మాటలను పూర్తిగా వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బీఆర్ఎస్ నాయకులకు తగదని అన్నారు. విమర్శించే వీరు అధికారంలో ఉన్నప్పుడు దీనిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. భరత్‌నగర్--దుబ్బపల్లి సర్వీస్ రోడ్డుపై కుర్మపల్లి చెరువు అవుట్‌ఫ్లో కాలువ కారణంగా ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఎన్ హెచ్ ఎ ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు లేఖ రాశారని గుర్తు చేశారు. సంబంధిత అధికారులు నివేదికలు సమర్పించినప్పటికీ



పనులు ప్రారంభం కాకపోవడంతో ఈసారి భారీ వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ నిధులు, అనుమతులు తీసుకొస్తున్నారని తెలిపారు. సర్వీస్ రోడ్డు, బాక్స్ కల్వర్ట్, లైటింగ్ వంటి పనులు త్వరితగతిన ప్రారంభించేలా మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మంత్రి గడ్డం వివేక్ నాయకత్వంలో చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగాజరుగుతున్నాయని, క్యాతనపల్లి మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, దాముక శిరీష, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ పోలం సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, సృజన ప్రధాన కార్యదర్శులు గోపు రాజం, ఏల్పుల సత్యనారాయణ సోషల్ మీడియా ఇంచార్జ్ బొద్దుల ప్రేమ్ సాగర్, కార్యదర్శులు కునారపు శివ, పైడాకుల శ్రీనివాస్, రాపాక రాజు, భైర మల్లేష్ , వెనిగల శ్రీనివాసరావు మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుర్రం అనిల్ కుమార్ నాయకులు దాముక రమేష్ ఆలేటి వెంకటేశ్, నేరెళ్ల చంద్రయ్య, పందిరి లింగయ్య, కనుకుంట్ల కనకయ్య, కనకం వెంకటేష్, మస్కం సంపత్, రంజిత్ కుమార్, పోగుల లచ్చులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలి





**- నంగునూరు సర్పంచి సనాదుల బాలపోచయ్య**

**-ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నంగునూరులో అవగాహన ర్యాలీ**

**నంగునూరు, ఆగస్టు 1**

పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలని నన్ను నువ్వు సర్పంచి సనాదుల బాలపోచయ్య చెప్పారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామపంచాయతీ ఆవరణంలో శు క్రవారం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాలపోచయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ టి.రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యత, శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే పోషక విలువలు, తొలి ఆరు నెలల పాటు శిశువులకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సిన అవసరం, తల్లి మరియు బిడ్డ ఆరోగ్య రక్షణలో తల్లిపాల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్, సీఏ లావణ్య, నంగునూరు అంగన్వాడి ఉపాధ్యాయులు తోట పద్మ, గాజర్ల ఇందిర, ఎం.లక్ష్మి, ఎస్.లక్ష్మి, రాజమల్లవ్వ, విమలతో పాటు వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి తల్లులకు తల్లిపాల ప్రాము ఖ్యతపై చైతన్యం కల్పించనున్నట్లు తెలిపారు. తల్లిపాలు శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక వికాసానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు.

# తల్లిపాలు బిడ్డ జీవితానికి వరం





**-ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**

**సిరిసిల్ల జిల్లా ఆగస్టు 01 హంసకలం వార్త ,**

తల్లిపాలు ప్రతి శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని, బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అత్యంత బలమైన పునాదిగా నిలుస్తాయని జిల్లా సంక్షేమ అధికారి పీ. లక్ష్మీ రాజం తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భ ంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని శాత్రాజుపల్లి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా సంక్షేమ అధికారి అక్కడ గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న ఆహార పదార్థాలు, పాలు, గుడ్ల సరఫరా, వాటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు.

ప్రసవం జరిగిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. మొదటి కొన్ని రోజులు వచ్చే పసుపు రంగు ముర్రుపాలు (కొలస్ట్రం) బిడ్డకు తొలి టీకాలా పనిచేస్తాయని, వాటిలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండి శిశువు రోగనిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు. బిడ్డకు నిర్ణీత సమయానికి కాకుండా ఆకలి సంకేతాలు చూపినప్పుడల్లా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. బిడ్డ రొమ్మును సరిగా పట్టుకునేలా (ప్రాపర్ లాచ్) చూసుకోవడం వల్ల తల్లికి నొప్పి తగ్గి, బిడ్డకు తగినంత పాలు అందుతాయని తెలిపారు. పాలిచ్చే సమయంలో తల్లి ప్రశాంతంగా ఉండాలని, పోషకాహారం తీసుకోవాలని, పాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, గుడ్లు, తగినన్ని నీళ్లు తీసుకోవడం వల్ల పాల ఉత్పత్తి మెరుగుపడుతుందని చెప్పారు.రాత్రి వేళల్లో కూడా శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రొలాక్టిన్ హార్మోన్ పెరిగి పాల ఉత్పత్తి అధికమ వుతుందని పేర్కొన్నారు. ఇంటి పనుల్లో భర్తతో పాటు కుటుంబ సభ్యులు సహకరించి బాలిం తకు తగిన విశ్రాంతి కల్పించాలని సూచించారు. మొదట్లో పాలు తక్కువగా వస్తున్నాయని ఆందోళన చెందకుండా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది లేదా నిపుణుల సలహాలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పీ. లక్ష్మీ రాజం సూచించారు.

## రాష్ట్ర మంత్రిని మర్యాదపూర్వకముగా కలిసి మొక్క అందజేసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఆగస్టు 01 మంచిర్యాల హంసకలం వార్త :**

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న నీటిమట్టం,ప్రాజెక్టు సామర్థ్యం అంశాలను పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర నీటిపారుదల, ఆహార - పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి.ఎ. భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, అధికారులతో కలిసి రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని మర్యాద పూర్వకముగా కలిసి మొక్కను అందజేశారు.



## కరీంనగర్ టూ టౌన్ పోలీసుల విస్తృత “కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్”






**హంసకలం వార్త ఆగస్టు 01 కరీంనగర్ :**

ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ ప్రాంతంలో విస్తృత కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ,సముదాయ సంప్రదింపుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్) వెంకటరమణ, టౌన్ ఏసీపీ వెంకటస్వామి మరియు టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పాల్గొని స్థానిక ప్రజలతో నేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అధికారులు మాట్లాడుతూ వివిధ అంశాలపై ప్రజలకు కీలక సూచనలు చేశారు: “సైబర్ నేరాల పట్ల అప్రమత్తత”సైబర్ మోసగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత లింక్‌లను క్లిక్ చేయవద్దని, ఓటీపీ లేదా బ్యాంక్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఒకవేళ మోసపోయినట్లయితే వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన” గంజాయి, మత్తు పదార్థాల వినియోగం మరియు అక్రమ రవాణా వల్ల యువత జీవితాలు ఎలా నాశనం అవుతున్నాయో వివరించారు. కాలనీల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. “రహదారి భద్రత”పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని విజ్ఞప్తి చేశారు.”వాహనాల తనిఖీలు పత్రాల పరిశీలన” కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా రామ్‌నగర్ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ తదితర పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చలానాలు విధించి జరిమానాలు విధించారు. ప్రజలు అన్ని వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.”సీసీ కెమెరాల ఏర్పాటు” నేరాల నివారణలో ‘నేను సైతం’ ప్రాజెక్ట్ కింద ప్రతి కాలనీ, వీధి మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రతను మరింత మెరుగుపరచుకోవచ్చని అధికారులు తెలిపారు. పోలీసులు మరియు ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి, కాలనీవాసులలో భద్రతా భావాన్ని పెంపొందించడానికే ఇటువంటి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువకులు, మహిళలు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రవాణా శాఖ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్



**ఆగస్టు 01 కామారెడ్డి హంసకలం వార్త :**

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, అధికారులు, సిబ్బందితో మాట్లాడి ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేలా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యాలయ నిర్వహణలో నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అవసరమైన సూచనలు చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్, మోటారు వాహనాల పరిశీలకుడు శంకర్ నారాయణ, సహాయ పరిశీలకుడు ఉదయ్ కుమార్, పరిపాలన అధికారి నజీర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యూఐడిఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

-కేంద్ర మంత్రి బండి సంజయ్
-నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



ఆగస్టు 01 కరీంనగర్ హంసకలం వార్త :
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 48వ డివిజన్‌లో యూఐడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ , నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం 19వ డివిజన్ రేకుర్తి లో యూఐడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.నగర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విస్తృత స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.యూఐడిఎఫ్ నిధులను సమర్థవంతంగా వినియోగించి నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని అన్నారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనాలకే వినియోగించ బడేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.స్థానిక ప్రజలు ఈ అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తమ డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ , డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు 48వ డివిజన్ కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్ , 19వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణ కార్పొరేటర్లు గాజా రమా శివరాం, మాసం గణేష్, సోమిడి వేణు, బండారి వేణు, మేకల వెంకటేష్, బండ రమణారెడ్డి, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, దేశ శిల్ప వేదం, పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, ఇతర కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా డివిజన్ల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు

ఆగస్టు 01 కామారెడ్డి హంసకలం వార్త. :



ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మహిళాభివృద్ధి, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రసన్న తెలిపారు. ఈ ఏడాది "స్థిరమైన జీవితం ప్రారంభానికి తల్లిపాలు -- ఫలితాలనిస్తున్న చర్యలను మరింత బలోపేతం చేయడం" అనే నేపథ్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పాలిచ్చే తల్లులకు అవసరమైన మద్దతు అందించడం, అనుబంధ పోషకాహార పద్ధతులపై సూచనలు ఇవ్వడం, గృహ సందర్శనల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రసవం అనంతరం వచ్చే ముర్రు పాలు (కొలస్ట్రం) శిశువుకు అత్యంత పుష్టికరమైనవని, పుట్టిన వెంటనే శిశువుకు ముర్రు పాలు అందేలా కుటుంబ సభ్యులు సహకరించాలని సూచించారు. శిశువుకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లి పాలు శిశువుకు తొలి టీకా వంటివని తెలిపారు. తల్లి పాలు విరేచనాలు, న్యుమోనియా వంటి వ్యాధుల నుంచి శిశువును రక్షించడమే కాకుండా, తల్లుల్లో కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంతో పాటు తల్లి--బిడ్డల మధ్య ప్రేమ, అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని వివరించారు. గర్భిణులు, బాలింతలు మరియు వారి కుటుంబ సభ్యులకు ఈ అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రసన్న తెలిపారు.

# ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచాలి





-నాణ్యమైన వైద్య సేవలతో ఓపీ సంఖ్య పెంచాలని వైద్య సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ ఆదేశాలు

వెల్దుర్తిమండల, ,ఆగస్టు 01 హంసకలం వార్త :
ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యశాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ సూచించారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో శనివారం తూప్రాన్ డివిజనల్ పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు, ఆరోగ్య అధికారులు, పీహెచ్‌సీ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన డాక్టర్ అనిల్, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉన్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రతి వైద్య సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీటి తొలగింపు, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య సూచనలు అందించాలని సూచించారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ఓపీ (అవుట్ పేషెంట్) సంఖ్య పెరిగేలా ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకాన్ని పెంపొందించాలని, రోగులకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులు, వైద్య సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా ప్రభుత్వ హాస్టళ్లలోని వంటశాలలు, ఆహార నిల్వ గదులను తరచుగా తనిఖీ చేసి పరిశుభ్రత ప్రమాణాలు తప్పని సరిగా పాటించేలా నిర్వాహకులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.తూప్రాన్ డివిజన్‌లో ఆరోగ్య సూచికలను మరింత మెరుగుపరిచేందుకు ప్రతి వైద్యాధికారి కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని, ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా సేవలందించాలని డాక్టర్ అనిల్ సూచించారు.ఈ సమావేశంలో వెల్దుర్తి మండల వైద్యాధికారి డాక్టర్ శిరీష, డాక్టర్ సౌజన్య, చేగుంట, మనోహరాబాద్ నర్సింగ్ మండలాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు (MLHPs), టీబీ సూపర్వైజర్లు, ఆర్బీఎస్‌కే (RBSK) బృందాల సభ్యులు, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు అమూల్యమైన వరం





గంభీరావుపేట ఆగస్టు 1 హంసకలం వార్త
ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో ఒకటవ తేదీ నుండి 7వ తేదీ వరకు జరిగే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో శనివారం రోజున గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామపంచాయతీలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ విమలా శంకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి పౌరులు కావున అధికారులు చెప్పిన సూచనలు పాటించి బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అలాగే అంగన్వాడి కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జి కళావతి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లిపాల వలన కలిగే లాభాలు తల్లిపాలు ఇవ్వకుండా పోత పాలు పట్టడం వలన కలిగే నష్టాల గురించి వివరిస్తూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టాలని పాలు త్రాగడం వలన రాబోయే రోజుల్లో ఎలాంటి వ్యాధి బారిన పడకుండా కాపాడుతుందని బిడ్డ పుట్టిన వెంటనే పాలు పట్టడం వలన ప్రేగులలో పేరుకుపోయిన మకిలి బయటకు వస్తుందని అలాగే ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టాలని ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటుగా అనుబంధ పోషక ఆహారం అందించాలని చెప్పడం జరిగింది తల్లిపాలు తాగడం వలన తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందని బిడ్డ యొక్క మేదో శక్తి చురుకుగా ఉంటుందని తల్లికి రొమ్ము క్యాన్సర్ గాని గర్భాశయ క్యాన్స ర్ లాంటివి రాకుండా ఉంటాయని తెలిపారు ఏఎన్ఎం ప్రవీణ మాట్లాడుతూ బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం అనగా తాత్కాలిక గర్భనిరోధకత ఉంటుందని పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని ఖర్చు కూడ తక్కువగా ఉంటుందని చెప్పడం జరిగింది కార్యక్రమంలో సర్పంచ్ విమల శంకర్ రెడ్డి అంగన్వాడి సూపర్వైజర్ జి. కళావతి ఏఎన్ఎం ప్రవీణ రాణి,అంగన్వాడీ టీచర్స్ మంగమ్మ, సిద్దేశ్వరి ఆశాలు సుమలత, జ్యోతి తో పాటు తల్లులు పాల్గొన్నారు

# వీధి వ్యాపారుల కూల్చివేతలపై బీఆర్ఎస్ ఆందోళన

-ఎమ్మెల్యే, డివిజన్ అధ్యక్షుల చొరవతో తాత్కాలికంగా నిలిచిన చర్యలు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 1 హంసకలం వార్త :
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని టీఎస్ఐఐసీ కాలనీ నుంచి రాజీవ్ గాంధీ నగర్ వరకు వీధి వ్యాపారుల వ్యాపార సముదాయాల తొలగింపుపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద జోక్యంతో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలను తాత్కాలికంగా నిలిపి వేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని టీఎస్ఐఐసీ కాలనీ నుంచి రాజీవ్ గాంధీ నగర్ వరకు రోడ్డు పక్కన ఉన్న వీధి వ్యాపారుల వ్యాపార సముదాయాలను సిఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించే చర్యలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా సిఎంసీ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ సంఘటన స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న నిరుపేద వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం వల్ల వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించి, వ్యాపారులకు తగిన అవకాశం కల్పించిన తర్వాతే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఈ విషయాన్ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్థానికంగా బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కనీసం రెండు వారాల పాటు కూల్చివేతలను నిలిపివేసి, వీధి వ్యాపారులు తమ జీవనోపాధిని కొనసాగించేందుకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే అధికారులను కోరినట్లు వెల్లడించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడిన అనంతరం కూల్చివేతలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. వీధి వ్యాపారులకు న్యాయం జరిగేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు, ప్రజలు ఎమ్మెల్యే జోక్యాన్ని స్వాగతిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. బోనాల పండుగ పూర్తయ్యే



వరకు కూల్చివేతలను నిలిపివేయడం తమకు ఊరట నిచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, ఇస్మాయిల్, జైకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు గ్రామాల్లో విజిబుల్ పోలిసింగ్ పై దృష్టి సారించాలి





**-ప్రజలకు మరింత చేరువగా పోలీస్ విధులు ఉండాలి.**

**-మత్తు పదార్థాలు, సైబర్ నేరాల నివారణకు గ్రామీణ యువతలో చైతన్యం పెంపొందించాలి.**

**-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే..**

వేములవాడ రూరల్, ఆగస్టు, 01 హంసకలం వార్త ,

నేరాల నియంత్రణే లక్ష్యంగా గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువయ్యేలా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు సూచించారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్లు పరిశీలించి అభినందించారు. ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అంది స్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారు లను ఆదేశించారు.కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు.పోలీస్ స్టేషన్



అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విపివోలు గ్రామాల్లో పర్యటిస్తూ ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే ఉన్నతాధి కారులకు సమాచారం చేరేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంత ప్రజలకు, యువతకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలి ంగ్‌ను మరింత ముమ్మరం చేసి అనుమానితులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా ఉంచి తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.నేను సైతం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో వాటి పాత్రను తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు.ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు , సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ వెంకట్రాజం, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించడం దురదృష్టకరం

**-సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి: బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01 హంసకలం వార్త ,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారా హిత్యమైనవని, విద్యార్థుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఇంజనీరింగ్ విద్యార్థులను కించపరిచేలా మాట్లాడటం ముఖ్యమంత్రి పదవికి తగదని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా ఇంజనీర్లు దేశ అభివృద్ధికి, సాంకేతిక రంగ పురోగతికి, పరిశ్రమల విస్తరణకు, మౌలిక వసతుల నిర్మాణానికి కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి విద్యార్థులను అవహేళన చేసేలా వ్యాఖ్యానించడం యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులు విద్య పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ప్రభుత్వం నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, ఖాళీ పోస్టుల భర్తీ, క్యాంపస్ నియామకాలు, విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిందిపోయి, వారినే లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు



చేయడం ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమేనని ఆరోపించారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని రాష్ట్రంలోని లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు బహిరం గంగా క్షమాపణ చెప్పాలని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలల వద్ద ఆందోళనలు నిర్వహించి, విద్యార్థుల తో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు." విద్యార్థులను అవమానించే ప్రభు త్వాలకు యువతే తగిన గుణపాఠం చెబుతుంది. విద్యార్థుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్వీ ఎల్లప్పుడూ ముందుం టుంది" అని కంచర్ల రవి గౌడ్ స్పష్టం చేశారు.ఈ విలేకరుల సమావేశంలో నాయకులు మట్టే శ్రీనివాస్, ఆరెల్లి వినయ్, బక్కని వేణు యాదవ్, మల్యాల ప్రవీణ్, శశి, ప్రశాంత్, విష్ణు, అజయ్, వివేక్, ఋషి కుమార్, ఆదిత్య రామ్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ

**-ఎస్ఐఆర్ గడువు ఆగస్టు 10 వరకు పొడిగింపు**

**- ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ**

**-రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష**

సిరిసిల్ల జిల్లా ఆగస్టు 01 హంసకలం వార్త ,

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), ఓటర్ల నమోదు, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్, ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా వివరించారు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 549 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. వీటిలో వేములవాడ నియోజకవర్గంలో 262, సిరిసిల్ల నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం జిల్లాలో 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు ఏవీ లేవని వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ



గడువును ఎన్నికల సంఘం ఆగస్టు 10 వరకు పొడిగించిందని, జిల్లాలో ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే 87.42 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తి అయినట్లు వెల్లడించారు.ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అనంతరం అభ్యంతరాల పరిశీలన, నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు.ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6, అదే లేదా ఇతర నియోజకవర్గానికి ఓటును బదిలీ చేసుకోవాలనుకునే వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తులను ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు సమర్పించవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ కోరారు.సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కె.ఎస్.బి. కుమారి, పర్యవేక్షకులు ప్రవీణ్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీని సందర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

**-వరద నీటి చేరికపై ప్రాజెక్టు అధికారులతో సమీక్ష**



నిజామాబాద్, ఆగస్టు 01 హంసకలం వార్త :

నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ లో గల శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ను శనివారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐ.టీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, మైనింగ్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తదితరులు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుండి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని (ఇన్ ఫ్లో) పరిశీలించారు. రిజర్వాయర్లో నీటి మట్టాన్ని పరిశీలించి ప్రాజెక్టుకు చెందిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎగువన గల గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు, బాలేగాం, బాబ్లీ బ్యారేజీలతో పాటు కడెం తదితర ప్రాజెక్టుల మిగులు జలాలు గోదావరి ద్వారా వచ్చి చేరుతుం డటంతో ఎస్సారెస్పీలో నీటి మట్టం పెరిగిందని అధికారులు మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికిప్పుడు వర్షాలు నిలిచిపోయినా, మరో 48 గంటల వరకు వరద నీరు ఇన్ ఫ్లో రూపంలో వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం1091.00 అడుగులు, 80 టీఎంసిలకు గాను, ప్రస్తుతం 1072.30 అడుగులు, 27.376 టీఎంసిల వద్ద నీరు నిలువ ఉందని తెలిపారు. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతాల నుండి శనివారం మధ్యాహ్నం సమయానికి 85వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలను బట్టి ఆయకట్టు పంటలకు ఏ మేరకు నీటిని విడుదల చేయాలని అన్న విషయమై రెండు మూడు రోజులలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.అయితే, గత మూడు సంవత్సరాలతో పోలిస్తే ఎస్సారెస్పీలో ఈసారి కొంత తక్కువ మేరకే నీటి నిల్వలు ఉన్నాయని, ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. గత సంవత్సరం ఇదే సమయానికి రిజర్వాయర్ లో 38 టీఎంసీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 27 టీఎంసీలకే పరిమితం అయ్యిందన్నారు. నిజానికి 112 టీఎంసీల పూర్తి స్థాయి సామర్థ్యంతో నిర్మించబడిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూడిక చేరడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎస్సారెస్పీ లో పూడిక తొలగింపు ప్రక్రియను చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయమై అతి త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ, శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర ప్రాజెక్టులు దశాబ్దాల కాలంగా చెక్కు చెదరకుండా లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నాయని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వ హయాంలో 2019 లో నిర్మించిన మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలు మాత్రం 2022 నాటికే కూలిపోయాయని మంత్రి ఉత్తమ్ కుమార్ ఆక్షేపించారు. వీటి అవసరం లేకుండానే ఎల్లంపల్లి రిజర్వాయర్ లోకి 20 టీఎంసీ ల నీరు వచ్చి చేరిందని అన్నారు. మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. పై బ్యారేజీలలో నీటిని నిలువ చేసే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారని, అన్ని విషయాలను శాస్త్రీయంగా, సాంకేతికపరంగా సమగ్ర పరిశీలన జరిపి మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇటీవల ఢిల్లీలో అత్యున్నత స్థాయిలో జరిగిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, కేంద్ర జల సంఘం సమావేశాల్లోనూ ఏకీభవించడం జరిగిందని మంత్రి తెలిపారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో ప్రజలపై ఎనలేని భారం మోపిందని ఆక్షేపించారు. మేడిగడ్డ పంప్ హౌజ్ ల ద్వారా గత ప్రభుత్వం 60 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే ఒక్క కరెంట్ బిల్లు రూపంలోనే 3వేల కోట్ల రూపాయల ఛార్జీలు అయ్యాయని అన్నారు. పంప్ హౌజ్ ల ద్వారా నీటిని ఎత్తిపోస్తే బ్యారేజీలను ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. అసంబద్ధ నిర్ణయాలతో ప్రజాధనం వృధా చేసిన వారే, ప్రస్తుతం తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాగా, ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన మంత్రులకు కలెక్టర్ భవేష్ మిశ్రా, సీ.పీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎస్సారెస్పీ సీ.ఈ సునితాదేవి తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
ఆదివారం 02 ఆగష్టు 2026

# బిజినెస్

## అత్యవసర, తక్షణ వైద్య సరఫరాల కోసం నిలువుగా ఎగిరే ఈ-విమానాలు



**ముంబై:** దేశంలో అత్యవసర, తక్షణ వైద్య సరఫరాల కోసం రన్‌వే అవసరం లేకుండా నిలువుగా ఎగిరే, దిగే ఎలక్ట్రిక్ విమానాల (ఈవీటీఓఎల్)ను వినియోగించే దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందుకు సాధ్యాసాధ్యాలపై ఉమ్మడిగా అధ్యయనం చేసేందుకు జపాన్‌కు చెందిన ఈవీటీఓఎల్‌ల అభివృద్ధి, తయారీ సంస్థ స్కైడ్రైవ్‌తో పాటు సుజుకీ మోటార్ కార్పొరేషన్‌తో ఎయిరిండియా అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చు కుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా స్కైడ్రైవ్ ఈవీటీఓఎల్ సాంకేతికతను, ఎయిరిండియా విమానాల నిర్వహణ నైపుణ్యాన్ని, సుజుకీ మార్కెట్ అనుభవాన్ని ఉపయోగించుకొని ఎమర్జెన్సీ మెడికల్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయనున్నాయి. దేశంలోని ప్రధాన నగరాలతో పాటు చిన్న నగరాల రోడ్లు కూడా అత్యంత రద్దీగా మారుతున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని వైద్యం కోసం దూర ప్రాంతాలకు తరలించడం లేదా కీలక ఔషధాల చేరవేత అత్యంత సవాలుగా మారింది. ఈవీటీఓఎల్‌ల వినియోగం ఈ సవాలును అధిగమించేందుకు దోహదపడనుంది.

## కో-లొకేషన్ కేసులో సెబీకి ఎన్ఎస్ఈ రూ.1,500 కోట్ల చెల్లింపు




**ముంబై:** చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కో-లొకేషన్ కేసులను పరిష్కరించుకునేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) రూ.1,491.21 కోట్లు చెల్లించనుంది. క్యాపిటల్ మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకిదే అతిపెద్ద సెటిల్‌మెంట్. కేసుల పరిష్కారం కోసం సవరించిన ఆఫర్‌ను అంగీకరిస్తున్నట్లు సెబీ జూలై 30న తమకు సమాచారం అందించిందని ఎన్ఎస్ఈ తెలిపింది. దీంతో ఎన్ఎస్ఈ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) సాఫీగా పూర్తయ్యేందుకు వీలు కలగనుంది. ఐపీఓ ద్వారా రూ.30,000 కోట్ల సమీకరణ కోసం ఎన్ఎస్ఈ ఇప్పటికే ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించింది. ఆర్‌టీఐ చట్టం కేసులో ఎన్ఎ?సఈకి తాత్కాలిక ఊరట: ఎన్ఎ?సఈ సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం పరిధిలోకి వస్తుందన్న కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. సీఐసీ ఆదేశాలను సవాలు చేస్తూ ఎన్ఎ?సఈ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు అంగీకరించిన జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాల ధర్మాసనం.. ఈ విషయంపై 4 వారాల్లో స్పందించాలని సీఐసీతో పాటు ఇతరులను కోరింది. స్టాక్ ఎక్స్ఛేంజీలు ప్రజల లావాదేవీలను నిర్వహిస్తాయి కాబట్టి వీటిని కూడా ఆర్‌టీఐ చట్టం పరిధిలోకి వచ్చే ప్రజా సంస్థలుగానే పరిగణించబడతాయని సీఐసీ 2007లో ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఎన్ఎ?సఈ అప్పట్లోనే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కానీ, ఈ జూలై 1న న్యాయస్థానం సీఐసీకి అనుకూలంగా తీర్పునివ్వడంతో ఎన్ఎస్ఈ.. సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

## హోటళ్లు, రెస్టారెంట్లకు ఊరట- భారీగా తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర




హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలకు కేంద్రం ఊరటనిచ్చింది. 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) రూ.200కుపైగా తగ్గించాయి. తాజా ధరలు అమల్లోకి వచ్చాయి. అయితే గృహ వినియోగదారులు ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. తాజా సవరణ ప్రకారం ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ.202, కోల్‌కతాలో రూ.209 వరకు తగ్గింది. దీంతో కోల్‌కతాలో ఒక్కో వాణిజ్య సిలిండర్ ధర రూ.2 ,872.50కు చేరింది. హైదరాబాద్‌లో రూ.206 తగ్గి రూ.2,985గా ఉంది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా దాదాపు ఇదే పరిధిలో ధరలు తగ్గించినట్లు ఓఎంసీలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపార సంస్థలపై ఇంధన భారం కొంత తగ్గనుంది. ఇటీవల పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ ఇంధన ధరలు పెరగడంతో వాణిజ్య ఎల్పీజీ ధరలు పలుసార్లు పెరిగాయి. ఇప్పుడు ప్రపంచ ఇంధన మార్కెట్లు క్రమంగా స్థిరపడుతుండటంతో ఓఎంసీలు ధరలను తగ్గించాయి. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ఎల్పీజీ ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. గత నెల జులై 1న కూడా 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.183.50 వరకు తగ్గించారు. వరుసగా రెండో నెలా ధరలు తగ్గడంతో వ్యాపార వర్గాలు ఊరట వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడం గృహ వినియోగదారులకు నిరాశ కలిగిస్తోంది.

## కామన్వెల్త్ గేమ్స్: భారత్ ఖాతాలో మరో రెండు పసిడి పతకాలు




**స్పోర్ట్స్ డెస్క్:** గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ ఖాతాలో మరో రెండు స్వర్ణాలు చేరాయి. ఇవాళ బాక్సింగ్ విభాగంలో భారత్ ఈ రెండు పసిడి పతకాలను సాధించింది. తొలుత మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ గోల్డ్ మెడల్ గెలిచింది. తుదిపోరులో కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నా డెల్గాడోను ప్రీతి చిత్తుగా ఓడించింది. అనంతరం మహిళల 57 కేజీల విభాగంలో జైస్మిన్ లాంబోరియా భారత్ కు పసిడిని అందించింది. ఫైనల్ లో నార్తర్న్ ఐర్లాండ్ కు చెందిన మైఖేలా వాల్ష్ పై జైస్మిన్ విజయం సాధించింది.భారత మహిళా బాక్సర్ ప్రీతి పవార్ మహిళల 54 కేజీల విభాగంలో స్కార్లెట్ సవన్నాపై సునాయాసంగా గెలుపొందింది. తొలి బౌట్ నుంచి ప్రీతి ప్రత్యర్థిపై పంచ్‌లతో విరుచుకుపడింది. ఇక రెండో బౌట్‌లోనూ ప్రీతి స్కార్లెట్ ముఖంపై పంచుల వర్షం కురిపించి ఆధిక్యంలో నిలిచింది. ఇక మూడో బౌట్‌లోనూ తనదైన శైలిలో విరుచుకుపడ్డ ప్రీతి పవార్‌ను యునానిమస్ విజయం సాధించినట్లు అంపైర్లు ప్రకటించారు. ఇప్పటికే బాక్సింగ్ విభాగం నుంచి కనీసం 10 పతకాలు ఖాయమైన సంగతి తెలిసిందే. ఇక మహిళల 57 కేజీల విభాగంలో జాస్మిన్ లంబోరియా కూడా స్వర్ణం కైవసం చేసుకుంది. కామన్‌వెల్త్‌లో భారత్‌కు ఇది ఏడో స్వర్ణం కాగా, ఓవరాల్‌గా 25వ పతకం.ఇక పురుషుల ట్రిపుల్ జంప్ విభాగంలో భారత అథ్లెట్లు మెరిశారు. ప్రవీణ్ చిత్రావేల్ 16.58 మీటర్ల ఎత్తు ఎగిరి రజతం సాధించాడు. మరో అథ్లెట్ సెల్వ ప్రభు 16.52 మీటర్ల ఎత్తు ఎగిరి కాంస్య పతకం అందుకున్నాడు. దీంతో భారత్ మొత్తం పతకాల సంఖ్య 27కు చేరుకుంది. ఇందులో 7 స్వర్ణాలు, 13 రజతాలు, 7 కాంస్యాలు ఉన్నాయి.

## భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీ కెప్టెన్ అవుతాడేమో: ఈస్ట్ జోన్ సెలెక్టర్




**ఇంటర్నెట్ డెస్క్:** దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టుకు భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంపై వస్తోన్న విమర్శలకు ఆ జట్టు సెలెక్టర్ ప్రవంజన్ మల్లిక్ సమాధానమిచ్చారు. జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వైభవ్ భవిష్యత్తులో కెప్టెన్ కూడా అవుతాడని అభిప్రాయపడ్డారు. స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈస్ట్ జోన్ జట్టుకు వైభవ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే 15 ఏళ్ల వయసులోనే ఇంత పెద్ద బాధ్యత ఇవ్వడం సరైన నిర్ణయం కాదంటూ సోషల్ మీడియాలో పలువురు మాజీ క్రికెటర్లు, అభిమానులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.వైభవ్‌ను కెప్టెన్‌గా నియమించలేదు. వైస్ కెప్టెన్ మాత్రమే. కెప్టెన్ ఇషాన్ కిషన్ వికెట్ కీపర్ కావడంతో రోజంతా మైదానంలో చురుకుగా ఉంటాడు. వైభవ్ మొత్తం మ్యాచ్‌కు నాయకత్వం వహించాల్సిన పరిస్థితి ఉండదు. చిన్న వయసులోనే బాధ్యతలు ఇవ్వడం అతడిని మరింత పరిణతి చెందిన ఆటగాడిగా తీర్చిదిద్దుతుంది. దేశం కోసం బాగా ఆడాలనే తపన వైభవ్‌లో ఉంది. యువ ఆటగాళ్లకు బాధ్యతలు అప్పగించడం చాలా ముఖ్యం. అందుకే ఈ అవకాశాన్ని కల్పించాం. వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో కెప్టెన్ అవుతాడేమో! అతడి ప్రతిభ అసాధారణం. వైభవ్ ఇప్పటికే బిహార్ ఫస్ట్‌క్లాస్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉంది. వాటిని మేము గౌరవిస్తాం. అయితే జట్టుకు ఏది మంచిదో అదే చేశాం. ఇది సెలక్షన్ కమిటీ సభ్యులందరూ కలిసి తీసుకున్న నిర్ణయం' అని ప్రవంజన్ స్పష్టం చేశారు.కాగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈస్ట్ జోన్ సెలక్షన్ కమిటీ సమావేశంలో ప్రవంజన్ మల్లిక్‌తో పాటు దిబ్యేందు చక్రవర్తి, మనీష్ వర్ధన్, అలోక్ సాహా, అనంత్ ప్రకాశ్ పాల్గొన్నారు. అయితే ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఈ దులీప్ ట్రోఫీ జరగనుంది. కాగా ఈస్ట్ జోన్ జట్టు తన తొలి మ్యాచ్‌ను నార్త్ జోన్‌తో ఆడనుంది.

# స్పోర్ట్స్

## నీరజ్ చోప్రా తదుపరి జావెలిన్ ఈవెంట్ ఎప్పుడంటే




**స్పోర్ట్స్ డెస్క్:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా కామన్వెల్త్ గేమ్స్‌లో అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో తన రెండో ప్రయత్నంలో ఈ సీజన్ అత్యుత్తమ త్రోగా 85.83 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. లంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరాగే పసిడి పతకం సాధించగా, భారత్‌కే చెందిన యశ్ వీర్ సింగ్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు.గతేడాది సెప్టెంబర్ నుంచి దిగువ వీపు గాయంతో బాధపడుతున్న నీరజ్ చోప్రా, సుదీర్ఘ పునరావాస శిక్షణ తర్వాత ఈ ఏడాదితో కలుపుకొని బరిలోకి దిగడం ఇది రెండోసారి మాత్రమే. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో నాలుగో స్థానంలో నిలిచిన నీరజ్, ఆ తర్వాత రబత్, రోమ్ లీగ్‌లకు దూరంగా ఉంటూ తుర్కియేలో కోలుకున్నాడు. గాయం ప్రభావం ఇంకా ఉన్నప్పటికీ, క్రమంగా పూర్వపు ఫామ్‌ను అందుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు నీరజ్ తెలిపాడు.

**-నీరజ్ చోప్రా తదుపరి షెడ్యూల్:**

ఈ పతకం తర్వాత నీరజ్ చోప్రా దృష్టి తదుపరి అంతర్జాతీయ టోర్నీలపై పడింది.

ఆగస్టు 21: లాసాన్ డైమండ్ లీగ్

ఆగస్టు 27: జ్యూరిచ్ డైమండ్ లీగ్

సెప్టెంబర్ 4-5: బ్రస్సెల్స్‌లో జరగబోయే డైమండ్ లీగ్ ఫైనల్స్

సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లోని ఐచి నాగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు ముందు ఈ డైమండ్ లీగ్ పోటీల్లో పాల్గొని తన ఫిట్‌నెస్‌ను మరింత మెరుగుపరచుకోవాలని నీరజ్ భావిస్తున్నాడు. ప్రస్తుతం డైమండ్ లీగ్ పాయింట్ల పట్టికలో నీరజ్ 5 పాయింట్లతో 7వ స్థానంలో ఉన్నాడు. సెప్టెంబర్‌లో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే రాబోయే రెండు లీగ్‌లలో కనీసం ఒకదానిలోనైనా మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. 2022లో డైమండ్ లీగ్ ట్రోఫీని గెలుచుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన నీరజ్, ఆసియా గేమ్స్‌లో మళ్లీ పసిడి పతకాన్ని సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.

## ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి ప్రీతి జింటా

# ఆమిర్ ఖాన్ బ్యానర్లో గ్రాండ్ రీఎంట్రీ



ఒకప్పుడు టాలీవుడ్ ప్రేక్షకులను సైతం మెప్పించిన బాలీవుడ్ నటి ప్రీతి జింటా... సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధ మయ్యారు. మహేశ్ బాబుతో 'రాజకుమారుడు', వెంకటేశ్ సరసన 'ప్రేమంటే ఇదేరా' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు అలరించిన ఆమె, వివాహం అనంతరం సినిమా లకు దూరమయ్యారు. ఇప్పుడు దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఒక భారీ పీరియాడికల్ డ్రామాతో గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ సరసన ప్రీతి జింటా కథానాయికగా నటించిన లేటెస్ట్ పీరియడ్ డ్రామా మూవీ 'బట్వార్ 1947'. 1947 నాటి దేశ విభజన నేపథ్యంలో ఎంతో ప్రతిష్ఠా త్మకంగా రూపు దిద్దుకున్న ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్పై ఆమిర్ ఖాన్ నిర్మించగా, విలక్షణ దర్శకుడు రాజ్కుమార్ సంతోషి తెరకెక్కి ంచారు. ఈ భారీ ప్రాజెక్ట్కు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు. ప్రీతి జింటా తో పాటు సీనియర్ నటి షబానా అజ్మీ, ఆలీ ఫజల్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించను న్నారు.దేశ విభజననాటి పరిస్థితులు, మానవీయ సంబంధాలు, ప్రజలు ఎదుర్కొన్న భావోద్వేగ ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో ప్రీతి జింటా ఎంతో ప్రాధాన్యత ఉన్న, బలమైన పాత్రలో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకునితుది పనులు జరుపు కుంటున్న ఈ చిత్రం, స్వాతంత్ర్య దినోత్స వాన్ని పురస్కరించుకుని ఆగస్ట్14న ప్రపం చవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## పేపర్ లీక్తో మళ్లీ నీట్ రాశా.. నాడు నేను పడిన కష్టం వర్ణనాతీతం: మానుషి చిల్లర్

దేశవ్యాప్తంగా నీట్ పరీక్షపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో మాజీ ప్రపంచ సుందరి, నటి మానుషి చిల్లర్ తన గతానుభవాలను పంచుకున్నారు. 2015లో నీట్ పేపర్ లీక్ కావడంతో మళ్లీ పరీక్ష రాయాల్సి రావడం తన జీవితంలోనే అత్యంత కఠినమైన దశల్లో ఒకటని ఆమె గుర్తుచేసుకున్నారు. ఇటీవలి విద్యార్థుల ఆందోళనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో మానుషి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నటి సోహా అలీ ఖాన్ పోడ్కాస్ట్లో మాట్లాడుతూ.. ఆనాటి అనుభవం కేవలం వ్యక్తిగతమైనదే కాదని, దేశంలోని లక్షలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న వాస్తవికతకు అద్దం పట్టిందని ఆమె అన్నారు. "ఈ విషయంలో రెండు కోణాలున్నాయి. ఒకటి నా వ్యక్తిగత అనుభవం, రెండోది దేశంలోని చాలామంది విద్యార్థులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవడం" అని మానుషి వివరించారు. తన తల్లిదండ్రులు కూడా వైద్య వృత్తిలో ఉండటంతో ఈ ప్రయాణానికి తాను మానసికంగా సిద్ధమయ్యానని, అయినప్పటికీ ఆ ప్రక్రియ ఎంతో భారం మోపిందని తెలిపారు.




## లవ్, బ్రేకప్ వార్తలపై అనుపమ పరమేశ్వరన్ స్పందన

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తమిళ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్తో తన లవ్ లైఫ్, బ్రేకప్ వార్తలపై వస్తున్న ఊహాగానాలపై ఎట్టకేలకు స్పందించింది. నెట్టింట వైరల్ అవుతున్న రూమర్లకు స్వస్తి పలుకుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా తన జీవితంలో అనేక ఒడిదుడుకులు, మానసిక సంఘర్షణలు ఎదుర్కొన్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమయంలో అత్యంత కష్టమైన పరిస్థితులను దాటుకుని ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపింది. "గత ఏడాది నా జీవితంలో అత్యంత సంక్లిష్టమైన, కష్టతరమైన ఘట్టం నడిచింది. ఆ కష్టాలను దాటుకుని, ఇప్పుడు మళ్లీ నా జీవితంలో సంతోషం, ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నాను" అని అనుపమ పేర్కొంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం, స్వీయ స్వేచ్ఛను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతూ... అభిమానులు, శ్రేయోభిలాషులు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపింది. తమిళ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్తో ప్రేమాయణం, తదనంతర బ్రేకప్ వార్తలపై మీడియాలో రకరకాల కథనాలు షికారు చేస్తున్న నేపథ్యంలో, ఆమె పరోక్షంగా ఇచ్చిన ఈ స్పష్టతతో ఆ పుకార్లన్నింటికీ తెరపడినట్లయింది.



## జూనియర్ ఎన్టీఆర్ 'డ్రాగన్'

# సినిమా శ్రీలంక షెడ్యూల్ రద్దు!

యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ – మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రం షూటింగ్ కు బ్రేక్ పడింది. ఇటీవల హై–వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా ఎన్టీఆర్ భుజానికి తీవ్ర గాయమవడంతో సినీ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే, వైద్యుల సూచన మేరకు తారక్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారని, కంగారు పడాల్సిన పనిలేదని ఆయన టీమ్ భరోసా ఇచ్చింది. వైద్యులు ఎన్టీఆర్ను సుమారు 6 నుంచి 8 వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోమని స్పష్టం చేయడంతో, 'డ్రాగన్' చిత్రీకరణను మేకర్స్ తాత్కాలికంగా నిలిపివేసి నట్టు తెలుస్తోంది. ఈ గాయం కారణంగా చిత్ర యూనిట్ ప్లాన్ చేసిన భారీ శ్రీలంక షెడ్యూల్ను పూర్తిగా రద్దు చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఎన్టీఆర్ కోలుకుని మళ్లీ పూర్తి ఫిట్నెస్ సాధించిన తర్వాతే.. అంటే సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ ప్రారంభంలో ఈ కొత్త షెడ్యూల్ను తిరిగి పట్టాలె క్కించే అవకాశాలున్నాయి. ప్లానింగ్ ప్రకారం ఈ చిత్రాన్ని 2027 జూన్ 11 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్మాతలు పనిచేస్తున్నారు. షూటింగ్కు తాత్కాలిక బ్రేక్ పడినా పోస్ట్ ప్రొడక్షన్, డెడ్లైన్లలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ప్రమాద ఘటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో #GetWellSoonNTR హ్యాష్ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. తమ అభిమాన నటుడు త్వరగా కోలుకుని, మరింత శక్తివం తంగా కెమెరా ముందుకు రావాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449